క్లుప్తంగా

యోగాంజనేయుడికి ప్రత్యేక పూజలు

కాజీపేట: స్థానిక స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వేసవి ఎండలు మండిపోతున్న నేపథ్యంలో వాతావరణం చల్లబడాలని ఆకాంక్షిస్తూ త్రిగుళ్ల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు 108 లీటర్ల బెల్లం పానకంతో 108 సార్లు మన్యు సూక్త విధానంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మణిదీప్, రవి, సుధీర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



కాశిబుగ్గ : నగరంలోని కాశిబుగ్గలో లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో వరుసగా 50వ రోజు చల్లని మంచినీటితో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం ముఖ్య అతిథిగా వరంగల్ ట్రాఫిక్ సీఐ బాబులాల్ హాజరై చలివేంద్రాన్ని సందర్శించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీరుస్తున్న లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వేముల నాగరాజు, రాంప్రసాద్, చందు, క్యాతం రందర్, శ్రీనివాస్, మామిడాల సతీష్ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి

న్యూశాయంపేట : మధ్యాహ్న భోజనం కార్మికులకు బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలో అనుబంధ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సమావేశం జిల్లా అధ్యక్షుడు డి.రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నెలల తరబడి వంట వండి పెడుతున్న కార్మికులకు విద్యాశాఖ బిల్లులు చెల్లించకుండా తాత్సారం చేస్తుందని ఆరోపించారు.

కులవృత్తులకు చేయూత

కాజీపేట అర్బన్ : వెనుకబడిన కులవృత్తులు, చేతివృత్తిదారులకు చేయూతనిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్ల నుంచి 55 ఏండ్లలోపు గల వెనుకబడిన తరగతుల వారు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ, కనుక దుర్గ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 6.30 నుంచి 11.30 గంటల వరకు, ఎన్జీఓస్ కాలనీ, శ్యామల గార్డెన్, అమరావతి నగర్, కుడా కాలనీ, బాలయ్య హోటల్ ప్రాంతాల్లో 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
హసన్‌పర్తి : చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఏరియాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. నిరూప్‌నగర్‌తండా మెయిన్ రోడ్డు, రైల్వేగేట్, ప్రధాన రహదారుల్లో విద్యుత్ స్తంభాలు మార్చే కార్యక్రమం చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కాజీపేట : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన తొమ్మిది మందిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, ఏడుగురికి రూ.11,900 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగరరావు తీర్పు ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. మారవేని రాజ్‌కుమార్, చుక్కా ప్రవీణ్‌లకు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

వరంగల్ చౌరస్తా : వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పించేందుకు బీఆర్ఎస్ నాయకుడు గందె నవీన్ మంగళవారం వరంగల్ చౌరస్తాలో ట్రాఫిక్, సివిల్ పోలీసులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బోగి సురేష్, దయాసాగర్, బిల్లా శ్రవణ్, పాల్గొన్నారు.

పథకాలను వర్తింపజేయాలి

నయీంనగర్: టీఎస్ఆర్టీసీ ఈపీఎస్ పెన్షనర్లకు ప్రభుత్వ ఉచిత పథకాలను వర్తింపజేయాలని టీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పు సమ్మయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం హన్మకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలి, మలిదశ సకల జనుల సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో పిఎల్ఎన్ రావు, ఎం.నర్సింగరావు, భూర నారాయణ, కెఎస్. చారి, కొమురయ్య పాల్గొన్నారు.

విద్యవైద్యానికే అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలా వరంగల్: తెలంగాణ ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడమే కాకుండా గురుకుల పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తోందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. మంగళవారం వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం శాంతినగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎమ్మెల్యే నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనైనా రాష్ట్రంలోనైనా విద్య వైద్యం ఎక్కడ బాగుంటుందో అక్కడే అద్భుత ప్రగతి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు కాక ముందు 270 గురుకులాలు ఉంటే నేడు వెయ్యికి పైగా ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నామని వివరించారు. పేద బిడ్డలు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, ఇటీవల ఎస్ఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 110 రోజుల పాటు 1700 మందికి కోచింగ్ ఇచ్చి భోజనం ఏర్పాటు చేసి మెటీరియల్ ఉచితంగా అందజేశామని గుర్తు చేశారు. అనంతరం అత్యుత్తమ మార్కులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చేతుల మీదుగా అవార్డులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పీ ఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీందర్, బీరెల్లి కమలాకర్, కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ, సుధాకర్, మాజీ కార్పొరేటర్ పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మ జనార్దన్ పాల్గొన్నారు.



ఖిలావరంగల్ : విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే ప్రథమం

రామన్నపేట : పది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిచిందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక వేడుకల్లో భాగంగా కొత్తవాడ పద్మశాలి కమ్యూనిటీ హాల్ నుంచి దేశాయిపేట కేఆర్ గార్డెన్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చేనేత పనిముట్లతో ప్రదర్శన చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వరంగల్ తూర్పు అంటే అజాంజాహి మిల్ అనే వారు అని..నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మిల్లును అమ్ముకుని నాలుగు వేల మంది కార్మికులను రోడ్డున పడవేశారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సంగెంలో 1200 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు చేసుకుంటున్నామని,దీంతో 10 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ శ్రీవాత్సవ, మాజీ కార్పొరేటర్ ఝెలగం లీలావతి సత్యనారాయణ, చేనేత కార్మికులు పాల్గొన్నారు.



రామన్నపేట : చేనేత కార్మికుల ర్యాలీలో ఎమ్మెల్యే నరేందర్, మేయర్ గుండు సుధారాణి

చెరువు ఉత్సవాలను జయప్రదం చేయాలి

● మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న చెరువు ఉత్సవాలను జయప్రదం చేయాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. మంగళవారం సాయంత్రం వరంగల్ భద్రకాళి బండ్‌ను మేయర్, కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే విధంగా బోనాలు, కోలాటం, బతుకమ్మల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. భద్రకాళి బండ్‌పై పండుగ వాతావరణం కనిపించేలా ముగ్గులు, తోరణాలతో సుందరంగా అలంకరించాలన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న రాసిన చెరువోయ్ చెరువు తదితర పాటలను వినిపించాలని, ప్రజలు ప్రజాప్రతినిధులు కలిసి సహపంక్తి భోజనాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, బల్దియా ఈఈ సంజయ్ కుమార్, సీఎంహెచ్ఓ రాజేష్, డీఈ రవికుమార్ తదితరులు ఉన్నారు.



భద్రకాళి బండ్ పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్, అధికారులు

ఆర్‌సీఓపై చర్యలు తీసుకోవాలి

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మూడు గురుకుల పాఠశాలలో క్యాటరింగ్ టెండర్ నోటిఫికేషన్ ఇవ్వకుండా గుత్తేదారులకు అమ్ముకున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల రీజనల్ కోఆర్డినేటర్ పై చర్యలు తీసుకోవాలని బీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు స్టీమ్ భోజనం అందించాలి, కానీ కట్టెల పొయ్యితో విద్యార్థులకు సమయానికి భోజనం అందించకుండా గుత్తేదారులు అన్యాయం చేస్తున్నారన్నారు. గతంలో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే సదరు కాంట్రాక్టర్, ఆర్‌సీఓ పై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిరుధాన్యాల్లోనే పోషకపదార్థాలు

కరీమాబాద్ : చిరుధాన్యాల్లో అనేక రకాల పోషక పదార్థాలు ఉంటాయని గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మామునూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించడం, గర్భిణులకు సీమంతం చేయడంతోపాటు హరితహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా అధికారిణి ఎం.శారద, సీడీపీఓ విశ్వజ, అంగన్‌వాడీ టీచర్‌లు మనోహరదేవి, శోభారాణి, సుజన పాల్గొన్నారు.

41వ డివిజన్ ఉర్సులో...

గ్రేటర్ పరిధిలోని 41వ డివిజన్ ఉర్సు బొడ్రాయి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం హరితహారం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హాజరైన కార్పొరేటర్ పోశాల పద్మ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ మమత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కార్పొరేటర్ పోశాల పద్మ

కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా జన్‌భాగీదారి

కాజీపేట అర్బన్ : మండలంలోని కడిపికొండ కేంద్రీయ విద్యాలయలో భారత ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యం కల్పించేందుకు నిర్వహిస్తున్న జన్ భాగీదారి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని ప్రిన్సిపాల్ మృదుల జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు న్యూ ఎడ్యుకేషనల్ పాలసీ–2020, వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ, వన్ ఫ్యూచర్, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరికల్ మిషన్ అండర్ నిపుణ్ భారత్ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేవీ ఆధ్వర్యంలో వారం పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారంరోజుల పాటు క్విజ్, వ్యాసరచన, రంగోలీ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీ ఉపాధ్యాయులు భిక్షపతి, శ్రీనివాస్, వెంకన్న, మాయావతి పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

సోనిబాబుకు పారిశ్రామిక ప్రగతి అవార్డు

కాశిబుగ్గ : వరంగల్ కాశిబుగ్గకు చెందిన దళితబంధు లబ్ధిదారుడు పెండ్యాల సోనిబాబు పారిశ్రామిక ప్రగతి అవార్డు అందుకున్నాడు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో దళితబంధు ద్వారా కాశిబుగ్గలో సోను టైల్స్ అండ్ శానిటరీ షాపు నడుపుతున్న సోనిబాబు కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా సోనిబాబు మాట్లాడుతూ దళితబంధు దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. సీఎం కేసీఆర్, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు తన జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు.



కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సోనిబాబు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

కాజీపేట: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక చాలా మంది ప్రాణాలను కోల్పోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సెయింట్ ఆన్స్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆరోకియా మేరీ పిలుపునిచ్చారు. 48వ డివిజన్ ఫాతిమానగర్ సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాలలో మంగళవారం యా బ్లడ్ యాప్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. యాప్ ఫౌండర్ డాక్టర్ జగదీష్ బాబు యలమంచిలిని సంఘ పెద్దలు అభినందించారు. ప్రమోటర్ చిలువేరు శంకర్ మాట్లాడుతూ బాలీవుడ్ నటుడు సోనూసూద్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండడం యాప్‌కు అదనంగా కలిసి వచ్చే అంశంగా పేర్కొన్నారు.

పరామర్శ



కాజీపేట : కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ కాలనీకి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు ఉడుతల బాబురావును జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. సోమవారం తెల్లవారు జామున బాబురావు కుమారుడు శివశంకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఎండీ.అంకూస్, మేకల ఉపేందర్, ఎంపీ రాజు, గుత్రం అమరనాథ్, పాక భాస్కర్ ఉన్నారు.

నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయం

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్

వరంగల్: పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న తరుణంలో నాటికల పోటీలు నిర్వహించడం అభినందనీయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలోని కళాభారతి సాంస్కృతిక సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి నాటికల పోటీలను సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం కళాకారులను ఎమ్మెల్యే శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ షీబారాణి, అనిల్‌కుమార్, రైతుబంధు జిల్లా అధ్యక్షురాలు లలితా యాదవ్, కళాభారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు సాంబయ్య, సుందర మూర్తి, ప్యాక్స్ చైర్మన్ హరికృష్ణ, శ్రీనివాస్, నేరెళ్ల రాజు, వెంకన్న, భిక్షపతి, ఆదాం పాల్గొన్నారు.



కళాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరూరి

ముమ్మరంగా సభ్యత్వ నమోదు చేపట్టాలి

ఖిలా వరంగల్: పద్మశాలీలు తమ ఐక్యతను చాటుతూ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. నగరంలోని 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోట పద్మశాలి సంఘం భవనంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రవీందర్ హాజరై ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, గోరంటల రాజు, బాసాని శ్రీనివాస్‌లతో కలిసి ఆయన సభ్యత్వాలను అందజేసి మాట్లాడారు. యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్‌తోట పద్మశాలి సంఘం అధ్యక్షులు పోరండ్ల ఓంప్రకాశ్, ఉపాధ్యక్షులు గంజి సదానందం, బుదారపు సాంబయ్య, ప్రధాన కార్యదర్శి కొక్కుల సాంబయ్య, వెల్దండి రవిచందర్, కోదాటి రాంమోహన్, బుదారపు రమేష్, హరికృష్ణ, ఆడెపు భిక్షపతి పాల్గొన్నారు.



సభ్యత నమోదు పత్రాలను అందజేస్తున్న రవీందర్

పేదల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట

మడికొండ : పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మంగళవారం 46వ డివిజన్ రాంపూర్‌లోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు లబ్ధిదారులకు అందేవిధంగా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, తక్కళ్ళపల్లి రాంగోపాల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు విజయ్‌రావు, దేవేందర్‌రావు, మధు, సంద్ర కుమార్, కోతి యాదగిరి, మునిగాల డానియేల్, పిట్టల రమేష్, మాదాసి యాదగిరి, దేవయ్య, రాజు, జాన్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్ : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈనెల 7న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు హనుమకొండ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల రమేష్‌బాబు, మహేశ్వరం గౌరీశంకర్ తెలిపారు. మంగళవారం హనుమకొండ తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను కలిసి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవ చేశామని, కానీ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తుందన్నారు. నిరాహార దీక్షలకు పెద్ద ఎత్తున సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కోమాకుల కుమారస్వామి,మహేష్, కుమారస్వామి, సతీష్, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీశైలం పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

సంక్షిప్త సమాచారం

సమాజాన్ని చైతన్య పరిచేది 'పాట'

కాశిబుగ్గ : సమాజాన్ని చైతన్యపరిచేది పాట అని ప్రజానాట్య మండలి(పీఎన్ఎం) జిల్లా కార్యదర్శి వి.దుర్గయ్య అన్నారు. పీఎన్ఎం ఆధ్వర్యంలో ఏసీరెడ్డినగర్‌లో రెండు రోజుల పాటు జరిగే జిల్లా స్థాయి పాటల, కళారూపాల శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గయ్య మాట్లాడుతూ పాట చాలా శక్తివంతమైందని, అది కొన్ని సందర్భాల్లో తూటాలుగా పని చేస్తుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కాశిబుగ్గ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు అన్నారు. మంగళవారం క్రిస్టియన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో టీఆర్‌టీ కాలనీలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణ కిశోర్



వరంగల్: వరంగల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా కాశిబుగ్గకు చెందిన రత్నం కృష్ణకిశోర్ నియమితులయ్యారు. మంగళవారం నియామక ఉత్తర్వులను జిల్లా పార్టీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

వరంగల్ అర్బన్ : సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)లో తలెత్తే సాంకేతిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ సీజీజీ ప్రాజెక్టు లీడర్ రవి కమిషనర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. మహానగర ప్రజలకు ఆన్‌లైన్‌లో సాంకేతికపరంగా ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అందుకోసం గ్రేటర్ వరంగల్ సీజీజీ నుంచి ఒక ప్రతినిధి అందుబాటులో ఉండాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఐటీ మేనేజర్ రమేష్, ఐటీ టెక్నిషన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని అరెస్ట్ చేయాలి

హన్మకొండ: దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తున్న రెజ్లర్లను వేధింపులకు గురిచేసిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని జై భీమ్ జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి కూడలిలోని జై భీమ్ కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయ్ మాట్లాడుతూ భారత రెజ్లర్ల సంఘానికి అధ్యక్షుడై ఆయన వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు.

అగ్నికి ఆహుతైన పొలాలు

కాజీపేట అర్బన్ : మండలంలోని అయోధ్యపురం, రాంపేట గ్రామాల్లోని పంట పొలాలు అగ్నికి ఆహుతైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మడికొండ పోలీసులు, ఫైర్ సిబ్బంది, రైతులు తెలిపిన కథనం ప్రకారం... ఆయా గ్రామాల్లోని పంట పొలాల్లో మంగళవారం మధ్యాహ్నం మండుటెండలో మంటలు చెలరేగడంతో రైతులు ఆందోళన చెంది ఫైర్ సిబ్బందికి, మడికొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు నాలుగు గంటల పాటు మంటలు చెలరేగాయి. ఘటనలో సుమారు పది ఎకరాల పంట పొలాల్లో మంటలు చెలరేగి, ప్రక్కనే ఉన్న గడ్డివాము, ఐదు బావిల్లోని బోర్లు పూర్తిగా కాలి బూడిదైపోయాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. భానుడి భగభగకు మంటలు చెలరేగాయా, ఎవరైనా నిప్పుపెట్టి ఉంటారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కాజీపేట: కదులుతున్న రైలు నుంచి పడి తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై పరుశురాములు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఈ నెల 2న నష్కల్ రైల్వేయార్డ్ వద్ద గుర్తు తెలియని యువకుడు పడి ఉన్నట్లుగా అందిన సమాచారం మేరకు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు చెప్పారు. గాయాలు తీవ్రంగా ఉండడంతో కోలుకోవడం కష్టంగా మారి యువకుడు మరణించినట్లు చెప్పారు. మృతదేహాన్ని గుర్తించడం కోసం ఎంజీఎం ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు. వివరాలకు 98663 30256, 94932 01968 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ఇద్దరి అరెస్ట్

కాజీపేట : తప్పుడు కాగితాలు సృష్టించి వారసత్వంగా రావాల్సిన భూమిని కాజేసిన తండ్రి, కొడుకును మంగళవారం అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన రావుల రాజమ్మ.. తన భర్త నుంచి అత్తింటి ద్వారా రావాల్సిన భూమిని బావ మల్లారెడ్డి, ఆయన కొడుకు రాజిరెడ్డి ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేసిందన్నారు. ఎస్సై ప్రమోద్ కుమార్ విచారణ చేపట్టగా మల్లారెడ్డి తప్పుడు కాగితాలు తయారు చేయించి రాజమ్మను ఇబ్బందులు పెడుతున్నట్లు నిర్ధారణ అయ్యిందని తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజు వివరించారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ అరికట్టాలి

విద్యారణ్యపురి : విద్యను వ్యాపారమయం చేస్తూ విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని ప్రైవేట్ స్కూళ్లలోని ఫీజుల దోపిడీని అరికట్టా లని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి మంగళవారం హనుమకొండ డీఈఓ ఎండి అబ్దుల్‌హైకి వినతిపత్రం సమర్పించారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు